క్లుప్తంగా

ఉదయభాను శ్రీరామ నవమి శుభాకాంక్షలు



జగ్గయ్యపేట అర్బన్: శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పండుగ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుందని, ప్రజలకు ఆ సీతారాముల ఆశీస్సులు మెండుగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

వైభవంగా చండీహోమం



పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో బుధవారం చండీహోమం వైభవంగా నిర్వహించారు. ఆలయ వేద పండితులు కృష్ణశర్మ ఆధ్వర్యంలో ఈ హోమం నిర్వహించి పూర్ణాహుతి జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు హోమ కార్యక్రమంలో పాల్గొన్నారు. హోమ కార్యక్రమంలో పాల్గొనటం వలన పలు కార్యాలు నెరవేరుతాయని పండితులు తెలిపారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు



నందిగామ: రెండో సంవత్సరం ఇంటర్ పరీక్షలు ముగిశాయి. ఈనెల 15వ తేదీన ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రథమ ఇంటర్ పరీక్షలు మంగళవారంతో ముగియగా ద్వితీయ ఇంటర్ పరీక్షలు బుధవారంతో ముగిశాయి. ఆఖరు పరీక్ష కావడంతో ప్రతి పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తీసుకువెళ్లేందుకు తల్లిదండ్రులు ఎదురుచూపులు చూస్తూ కనిపించారు. ముఖ్యంగా పరీక్షా కేంద్రాల్లో నుంచి వచ్చే విద్యార్థులు చివరి రోజు కావడంతో కేరింతల కొడుతూ ఉల్లాసంగా..ఉత్సాహంగా బయటకు వచ్చారు.

అభివృద్ధి పనులపై వీడియో కాన్ఫరెన్స్



నందిగామ: జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులపై బుధవారం జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఆర్డీట రవీంద్రరావు తన కార్యాలయం నుంచి పాల్గొన్నారు. డివిజన్ పరిధిలోని అధికారులు ఆయా మండలాల నుంచి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ నాడు–నేడు, గృహ నిర్మాణాలు, జిల్లాలో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారన్నారు. గృహ నిర్మాణాలు వేగవంతం కావాలని సూచించినట్లు తెలిపారు.

అన్నదానానికి విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి బుధవారం విజయవాడ, పడమట ప్రాంతానికి చెందిన ఉప్పాల సాయిబాబు, స్నేహనాగ దంపతులు రూ.51,116 లు ఆలయ ఇన్స్పెక్టర్ బద్దుల కృష్ణప్రసాద్, పాలకవర్గ సభ్యులు కోలా రామారావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

వాలీబాల్ పోటీలో ప్రతిభ



కంచికచర్ల: మండలంలోని గనిఆత్కూరులో మహిళా పోలీస్‌గా పనిచేస్తున్న జీ విక్టర్ కుమారి ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ వాలీబాల్ నేషనల్‌లో ఆడి మంచి ప్రతిభ కనబర్చి పతకాలు సాధించినందుకు బుధవారం సీఐ కార్యాలయంలో అభినందించారు. రూరల్ సర్కిల్ సీఐ ఐవీ నాగేంద్రకుమార్ మాట్లాడుతూ ఈనెల 22 నుంచి 26వ తేదీ వరకు కేరళ రాష్ట్రంలో జరిగిన ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ వాలీబాల్ నేషనల్స్‌లో రాష్ట్రం తరుపున మహిళా పోలీస్‌గా పనిచేస్తున్న విక్టర్ కుమారి పాల్గొని బహుమతులు, ప్రశంసాపత్రాలు సాధించారని తెలిపారు. ఎస్ఐ పీఎస్ సుబ్రహ్మణ్యం, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అక్కచెల్లెమ్మలకు ఆర్థిక చేయూతే లక్ష్యం

- ఎమ్మెల్యే జగన్‌మోహనరావు
- ఘనంగా ఆసరా సంబరాలు



చందర్లపాడులో వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: అక్క చెల్లెమ్మలకు ఆర్థిక చేయూతే లక్ష్యంగా సీఎం జగన్ పాలన కొనసాగిస్తున్నారని, రాష్ట్రంలోని పొదుపు సంఘాలు దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. చందర్లపాడులోని అలివేలమ్మ తల్లి ఫంక్షన్ హాల్‌లో బుధవారం మూడో విడత వైఎస్సార్ ఆసరా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పొదుపు సంఘాల మహిళలకు ఆసరా నమూనా చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వరుసగా మూడో ఏడాది కూడా వైఎస్సార్ ఆసరా అందించటం గర్వంగా ఉందని చెప్పారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు దిగ్గజ కంపెనీలు, బ్యాంకులతో ఒప్పందాలు చేసుకుని వ్యాపార మార్గాలు చూపటంతో పాటు ఆసరా, చేయూత, సున్నా వడ్డీ వంటి పథకాలతో సుస్థిర ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బాటలు వేస్తున్నారని కొనియాడారు.

1108 సంఘాలకు..రూ.9.22 కోట్లు..

చందర్లపాడు మండలంలోని 1108 పొదుపు సంఘాలకు వైఎస్ఆర్ ఆసరా ద్వారా రూ. 9.22 కోట్లను 11,080 మంది అక్కచెల్లెమ్మల ఖాతాలలో జమ చేయటం జరిగిందని జగన్‌మోహనరావు పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి డ్వాక్రా సంఘాలను ఆదుకోవటమే కాకుండా వాటికి పూర్వ వైభవం తీసుకువచ్చేలా పాలన సాగిస్తున్నారని చెప్పారు. డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, ఎంపీపీ వేల్పుల ఏశమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు ముక్కపాటి నరసింహారావు, సర్పంచ్ పున్నమ్మ, మహిళా సమాఖ్య జిల్లా మాజీ అధ్యక్షురాలు శాఖమూరు వెంకట కుమారి, వైస్ ఎంపీపీ నల్లాని రమాదేవి, ఏఎంసీ మాజీ చైర్మన్ వెలగపూడి వెంకటేశ్వరరావు, పార్టీ మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు, రాయల జానకి రామయ్య, పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

శ్రీరామ నవమికి సర్వం సిద్ధం

నేడు సీతారాముల కల్యాణం

పెనుగంచిప్రోలు: శ్రీరామ నవమి ఉత్సవాలకు ఆలయాలు, మండపాల వద్ద భక్తులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. గురువారం స్వామి వారి కల్యాణం సందర్భంగా ఆలయాలకు రంగులు వేసి ముస్తాబు చేశారు. ఎప్పటి నుంచో శ్రీసీతారాముల కల్యాణం చేస్తున్న మండపాల వద్ద కూడా నవమి ఏర్పాట్లు చకచకా చేస్తున్నారు. శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో శ్రీరామ నవమి వేడుకలకు ఆలయంలో విగ్రహాలకు రంగులు వేసి సిద్ధం చేస్తున్నారు.

శ్రీరామ నవమికి ముస్తాబైన ఆలయాలు

జగ్గయ్యపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో రామాలయాలు, ఆంజనేయ స్వామి ఆలయాలను నిర్వాహకులు ముస్తాబు చేశారు. గురువారం శ్రీరామ నవమి కావటంతో ఆలయాల వద్ద పందిళ్ల ఏర్పాటు చేశారు. సీతారాముల కల్యాణం నిర్వహించేందుకు ఆలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రావిరాల గ్రామంలో అభయాంజనేయ స్వామి ఆలయంలో భక్తులు ప్రతి ఏటా సీతారాముల కల్యాణం నిర్వహిస్తుండటంతో ఈ ఏడాది కూడా కల్యాణానికి ఆలయాన్ని ముస్తాబు చేశారు. భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.



కొణకంచిలో స్వామివారి కల్యాణానికి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

నవమి వేడుకలకు ఆలయాలు సిద్ధం

నందిగామ: సబ్‌డివిజన్ వ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. ప్రతి గ్రామంలో వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు కొన్ని ఆలయాలు, కూడళ్లలో చలువ పందిళ్లు, మరి కొన్ని ఆలయాల్లో షామియానాలు వేసి ఆలయాలను అందంగా అలంకరించారు. కొన్నిచోట్ల నవమి సంబరాలు బుధవారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో సీతారామాంజనేయ స్వామి ఆలయంలో స్వామి వారిని పెండ్లి కుమారుడిని చేయటంతో పాటు పలు రకాల విశేష పూజలు నిర్వహించారు. గురువారం ఉదయం స్వామి వారి కల్యాణ కార్యక్రమం ఘనంగా నిర్వహించేందుకు సబ్ డివిజన్ వ్యాప్తంగా ఏర్పాట్లు చేశారు.

సంక్షేమ పాలనతో రాష్ట్రం వైపు దేశం చూపు

- ఎమ్మెల్యే జగన్‌మోహనరావు
- ముప్పాళ్లలో గడప గడపకు మన ప్రభుత్వం



లబ్ధిదారుడికి పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనతో యావత్ దేశం రాష్ట్రం వైపు చూస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామంలో బుధవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి బుక్‌లెట్లను అందజేశారు. ముందుగా ఎమ్మెల్యేకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు, యువత ఘన స్వాగతం పలికారు. జగన్‌మోహనరావు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధి అని గత పాలకుల మాదిరిగా మాటల్లో చెప్పకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేతల్లో చూపుతున్నారన్నారు. రాష్ట్రంలో సాగుతున్న ప్రజా ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండి రానున్న ఎన్నికల్లో మద్దతు పలికి ఆశీర్వదించాలని కోరారు. వైస్ ఎంపీపీ నల్లాని రమాదేవి, పీఏసీఎస్ చైర్మన్ నల్లాని అయ్యన్న, పార్టీ మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు, నాయకులు యార్లగడ్డ సత్యనారాయణ ప్రసాద్, బండారుపల్లి కపిల్, పలువురు నాయకులు, కార్యకర్తలు, వలంటీర్‌లు, సచివాలయ ఉద్యోగులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిటాల గ్రామంలో..

కంచికచర్ల : అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కృత నిశ్చయంతో పనిచేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు అన్నారు. మండలంలోని పరిటాల గ్రామంలో ఎమ్మెల్యే 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి, ప్రజలను ఆప్యాయంగా పలుకరించంతోపాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, లబ్ధిదారులకు అందుతున్న తీరు గురించి అడిగితెలుసుకున్నారు. సర్పంచి యద్దనపూడి ఆనందజ్యోత్స్న, గ్రామ గృహసారథుల మండల కన్వీనర్ చింతా రవీంద్రనాథ్, నాయకులు మార్త శ్రీనివాసరావు, వెంపరాల ఆంజనేయులు, కర్ల రామకృష్ణ, శివనాగేశ్వరరావు, జమలయ్య, జాన్‌బాబు, ఏసుబాబు, యద్దనపూడి విజయారావు, వేముల జీవరాజు, జిక్కుల నరసింహారావు, వేములు నాగరాజు, పంచాయతీ కార్యదర్శి మీర్జావలి, వెల్లంకి రామారావు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

పెద్దాపురం(వీరులపాడు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించారని జగనన్న గోరుముద్ద ద్వారా విద్యార్థులకు రుచికరమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు ఎంపీపీ కోటేరు లక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని పెద్దాపురం గ్రామంలోని అంగనవాడీ కేంద్రాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు ప్రభుత్వ మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలన్నారు. విద్యార్థులు ఆరోగ్యంతో ఉండాలనే మంచి మనసుతో రాగిజావను అందించటం జరుగుతుందన్నారు. సర్పంచ్ నిప్పులపల్లి శాంతమ్మ, ఉప సర్పంచ్ బవిరిశెట్టి లక్ష్మి, సొసైటీ చర్మన్ ఆవుల ప్రసాద్, మాజీ చైర్మన్ కోటేరు సత్యనారాయణరెడ్డి, హెచ్ఎం వెంకట్రావ్, పలువురు ఉపాధ్యాయులు, చిన్నారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర

జగ్గయ్యపేట అర్బన్: వేసవి కాలం దృష్ట్యా పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా వార్డుల్లో బోరు పంపులను ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. బుధవారం స్థానిక 24 వార్డులో రెండు బోరు పంపులు, 31వ వార్డులో ఒక బోరు పంపు ఏర్పాటు పనులను ప్రారంభించారు. స్థానికులతో కొబ్బరికాయలు కొట్టించి పూజ చేయించారు. అనంతరం 21వ వార్డులో రూ.10 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులను పర్యవేక్షించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్లు వట్టెం మనోహర్, గింజుపల్లి వెంకట్రావు, పందుల రోశయ్య, సాధుపాటి రాజు, మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు, నాయకులు గింజుపల్లి కృష్ణ, చిరంజీవి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం



బోరు పంపు పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర తదితరులు

పట్టణంలో నెహ్రూచౌక్‌లో నిర్మిస్తున్న మినీ పార్కును మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర పరిశీలించారు. త్వరలోనే పార్కును ఎమ్మెల్యే ఉదయభాను ప్రారంభించనున్నారని తెలిపారు. పట్టణంలోని మఠం శివాలయం ప్రాంతంలో చిన్న బ్రిడ్జి నుంచి గురప్ప స్వామి ఆలయం వరకు నిర్మిస్తున్న గ్రావెల్ రోడ్డు, బుక్కా వారి వీధిలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డును రాఘవేంద్ర పరిశీలించారు. కౌన్సిలర్లు వట్టెం మనోహర్, పందుల రోశయ్య, గెల్లా సంధ్యారాణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదేశాలు బేఖాతరు చేస్తే చర్యలు తప్పవు

మున్సిపల్ కమిషనర్

జగ్గయ్యపేట అర్బన్: అధికారుల ఉత్తర్వులు బేఖాతరు చేస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు అన్నారు. బుధవారం 5వ వార్డు సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆయుష్మాన్ భారత్, పాఠశాలల తనిఖీ, కాన్సిస్టెంట్ రిథమ్ తదితర కార్యక్రమాలపై సచివాలయ కార్యదర్శులతో చర్చించారు. డేటా ప్రాసెసింగ్, మహిళా పోలీస్, ఎమినిటీ, హెల్త్ సెక్రటరీలు వారికి కేటాయించిన లక్ష్యాలను తనిఖీ చేశారు. తనిఖీ రిపోర్టు ఎప్పటికప్పుడు ఫొటోలు పంపాలని ఆదేశించారు. రిజిస్టర్లను తనిఖీ చేశారు. వార్డు సచివాలయాల సర్వీసులను ఇంకా మెరుగుపరచుకోవాలని ఆదేశించారు. జగనన్న కాలనీలు లే అవుట్-1, లే అవుట్-2లో గృహ నిర్మాణాలను పరిశీలించారు. నిర్ణీత సమయంలోపుగా నిర్మాణాలు పూర్తిచేయాలని హౌసింగ్ సిబ్బంది, ఎమినిటీ సెక్రటరీలను ఆదేశించారు.



సచివాలయంలో రిజిస్టర్లను తనిఖీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి



మొక్కజొన్న పొలంలో ఏడీఏ, ఏఓ, రైతులు

కంచికచర్ల : మొక్కజొన్న పంటల్లో నాణ్యమైన వంగడాలను ఎంచుకుని తెగుళ్లను నివారించుకోవాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ మునీషా అన్నారు. మండలంలోని బత్తినపాడు గ్రామంలో రైతులు సాగుచేసిన మొక్కజొన్న పంటలను బుధవారం పరిశీలించారు. ఏడీఏ మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలని, అప్పుడే వ్యవసాయానికి పెట్టుబడి ఖర్చు తగ్గిపోతుందన్నారు. వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలన్నారు. సర్పంచి జంగా సంతోషరావు, జిల్లా వనరుల కేంద్రం ఏఓ సత్యవతి, మండల వ్యవసాయ అధికారి కే విజయకుమార్, వీఏఏ ఎం.శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

రసవత్తరంగా బార్ అసోసియేషన్ ఎన్నికలు

పోటా పోటీగా ప్రచారం



అన్నెపాక సుందరరావు



అన్నెపాక కాంతారావు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ఎన్నికలు రసవత్తరంగా మారాయి. జగ్గయ్యపేట బార్ అసోసియేషన్‌లో మొత్తం 69 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో ఇద్దరు ప్రెసిడెంట్ పదవికి, మరో ఇద్దరు జనరల్ సెక్రటరీ పదవికి పోటీలో ఉన్నారు. మిగిలిన పదవులకు ఏకగ్రీవం అయ్యాయి. వీటిలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా అన్నెపాక సుందరరావు, అన్నెపాక కాంతారావు పోటీ పడుతుండగా, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ అభ్యర్థులుగా యలమంచిలి నాగరాజేంద్రప్రసాద్, మెట్టెల వీరాంజనేయులు పోటీ పడుతున్నారు. ఒకరికొకరు తానే గెలుస్తానంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. అన్నెపాక సుందరరావు గతంలో ఐదేళ్ల పాటు బార్ ప్రెసిడెంట్‌గా చేసిన అనుభవంతో పాటు గతంలో చేసిన అభివృద్ధి పనులు తనను గెలిపిస్తాయని ధీమాతో ఉండగా, అన్నెపాక కాంతారావు గతంలో ప్రెసిడెంట్‌గా పోటీ చేసి ఓడిపోవడం, మరోమారు జనరల్ సెక్రటరీగా పోటీ చేసి గెలిచారు. సీనియర్ న్యాయవాదిగా న్యాయవాదులతో తనకున్న సన్నిహిత సంబంధాలు తనను గెలిపిస్తాయనే ధీమాతో ఉన్నారు. తమకు ఉన్న పరిచయాలు, సంబంధాలే తమకు గెలిపిస్తాయని జనరల్ సెక్రటరీగా బరిలో ఉన్న రాజేంద్రప్రసాద్, ఆంజనేయులు ధీమాతో ఉన్నారు. ఇప్పటికే ప్రచారం గడువు ముగియగా ఎవరికి వారే గెలుపు ధీమాతో ఉన్నారు. 69 మంది న్యాయవాదుల్లో 9 మంది న్యాయవాదులు న్యూట్రల్‌గా ఉన్నారు. ఈ తొమ్మిది మంది న్యాయవాదుల ఓట్లు ఎవరికి పడితే వారే గెలుస్తారని తెలుస్తోంది. గెలుపు ఓటములు తెలియాలంటే ఈనెల 31వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు వేచి చూడాల్సిందే.

వయ్యారి భామ మొక్కలను తొలగిద్దాం



వయ్యారిభామ మొక్కలను తొలగిస్తున్న మున్సిపల్ కమిషనర్, సిబ్బంది



తోటచర్లలో కలుపు మొక్కల నిర్మూలన కార్యక్రమంలో ఎంపీపీ గాంధీ తదితరులు

మున్సిపల్ కమిషనర్

నందిగామ: వయ్యారిభామ మొక్కలు ఉండడం మానవ ఆరోగ్యానికి హానికరమని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు ఆదేశాల నేపథ్యంలో బుధవారం నందిగామ మున్సిపాలిటీ పరిధిలో వయ్యారిభామ (పార్థీనియం) మొక్కలు పీకివేసే కార్యక్రమాన్ని స్వయంగా కమిషనర్ తోపాటు మున్సిపల్ సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణ పరిధిలో వయ్యారిభామ మొక్కలను తొలగించే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ నిర్వహించాలన్నారు. పలువురు మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కంచికచర్ల : వయ్యారి భామ కలుపు మొక్కల వల్ల ప్రమాదకరమైన ఎగ్జిమా, హై ఫీవర్, ఉబ్బసం, బ్రాంకైటీస్ వ్యాధులు వస్తాయని ఎంపీడీఓ కే బాల శంకరరావు అన్నారు. కంచికచర్లలో బహిరంగ ప్రదేశంలో దట్టంగా పెరిగిన వయ్యారిభామ కలుపు మొక్కలను బుధవారం పీకేశారు. సీడీపీఓ కే లక్ష్మి భార్గవి, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి కనగాల రవికుమార్, మాజీ ఎంపీటీసీ సభ్యులు వేల్పుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. గండేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సర్పంచి బొక్కా రవి కుమార్, హెచ్ఎం రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

తోటచర్ల(పెనుగంచిప్రోలు): ప్రాణాంతకమైన వయ్యారి భామ మొక్కలు ఎక్కడ కనిపించినా తొలగించి తగులబెట్టాలని ఎంపీపీ మార్కపూడి గాంధీ అన్నారు. జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు పిలుపు మేరకు బుధవారం గ్రామాల్లో వయ్యారిభామ మొక్కల సామూహిక నిర్మూలన కార్యక్రమాలు చేపట్టారు. మండలంలోని తోటచర్ల గ్రామంలో జరిగిన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ కున గుంట్ల రాములమ్మ, సొసైటీ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. పెనుగంచిప్రోలులో సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, అనిగండ్లపాడులో సర్పంచ్ బి.జ్యోతిబ్రహ్మం ఆధ్వర్యంలో వయ్యారి భామ మొక్కల నిర్మూలన కార్యక్రమాలు చేపట్టారు.

వయ్యారిభామ మొక్కల నిర్మూలన

పటమట(విజయవాడతూర్పు): వయ్యారిభామ కలుపు మొక్కలను నగరంలోని అన్ని ప్రాంతాల్లో నిర్మూలించాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ ఆదేశించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ఉత్తర్వుల మేరకు 'వయ్యారి భామ – కలుపు మొక్క నిర్మూలన' కార్యక్రమన్ని నగర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. వయ్యారి భామ కలుపు మొక్క, దాని పుప్పొడి ఆస్తమా, చర్మ వ్యాధులతో పాటు వాయు కాలుష్యానికి కూడా కారణమవుతుందని చెప్పారు. ప్రజారోగ్య దృష్ట్యా వాటిని నిర్మూలించాలని పేర్కొన్నారు. నగరంలోని 64 డివిజన్లలోని నివసేతర ప్రాంతాల్లో, ఖాళీ ప్రదేశాల్లో నిరుపయోగంగా పెరుగుతున్న వయ్యారి భామ కలుపు మొక్కలను వేరులతో సహా తొలగించి కాల్చేయాలని తెలిపారు.

బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

పెనుగంచిప్రోలు: మహిళలు అన్ని రంగాల్లో రాణించి ఆర్థికాభివృద్ధి సాధించాలని సర్పంచ్ వేల్పుల పద్మకుమారి అన్నారు. స్థానిక సత్రం సెంటర్‌వద్ద కేంద్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో జనశిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని మహిళలకు ఏర్పాటు చేసిన బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి ఉన్నవారు 7702089200 నంబర్‌ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో అనిగండ్లపాడు గ్రామ సర్పంచ్ బి.జ్యోతిబ్రహ్మం, శిక్షకులు డి.శారద, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

రేపటి నుంచి శాస్త్రీయ సంగీతోత్సవాలు

విజయవాడకల్చరల్: స్వరఝరి 35వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు శివరామకృష్ణ క్షేత్రంలో శాస్త్రీయ సంగీత మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు స్వరఝరి కార్యదర్శి మోదుమూడి సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం మల్లాది శివానంద యశస్వి గాత్రం, శనివారం కొమ్మాజోస్యుల అలేఖ గాత్రం, ఆదివారం వయోలిన్ విద్వాంసుడు ద్వారం దుర్గాప్రసాద్‌కు చింతలపాటి లక్ష్మి స్మారక పురస్కారం అందిస్తామన్నారు. దుర్గాప్రసాద్ వాయిలీన సంగీత కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి



రుణాలు అందిస్తున్న సర్పంచ్ కమల, పీఏసీఎస్ అధ్యక్షుడు శేషగిరిరావు

గుమ్మడిదూర్రు(పెనుగంచిప్రోలు): రైతులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని సకాలంలో చెల్లించాలని ప్రాథమిక సహకార పరపతి సంఘం అధ్యక్షుడు వేమూరి శేషగిరిరావు, సర్పంచ్ నక్కా కమల అన్నారు. బుధవారం మండలంలోని గుమ్మడిదూర్రు పీఏసీఎస్‌లో 39 మంది రైతులకు రూ.2,12,10,000 దీర్ఘకాలిక రుణాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా విస్తృత సేవలు అందించటంతో పాటు సహకార సంఘాల ద్వారా కూడా ఎన్నో రకాల రుణాల అందిస్తున్నారన్నారు. రైతు శ్రేయస్సే ధ్యేయంగా ముఖ్యమంత్రి పని చేస్తున్నారన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు ముచ్చు కృష్ణకుమారి, నక్కా సుధాకర్, సంఘ మాజీ అధ్యక్షుడు పోపూరి రామకోటేశ్వరరావు, పొన్నం ప్రసాదరావు, సీఈఓ మునగ శివరామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు గుర్రం రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

నేడు భవానీ ద్వీపంలో సీతారాముల కల్యాణోత్సవం

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక పర్యాటకం(రెలిజిఎస్ టూరిజం) ప్రమోషన్‌లో భాగంగా గురువారం భవానీ ద్వీపంలో శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సీతారాముల కల్యాణం జరుగుతుందన్నారు. అనంతరం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మహిళలతో కోలాటాలు, కూచిపూడి నృత్యం, ఆంధ్రా శివమణిగా పేరొందిన మాస్టర్ చెర్రీ డ్రమ్స్ షో, జానపద డప్పు కళాకారుల విన్యాసాలు, జానపద నృత్యాలు తదితర కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. పర్యాటకులు సాధారణ బోటు ఛార్జీలతోనే ఈ మహోత్సవంలో పాల్గొనవచ్చని కోరారు.

పాఠశాలకు టీవీ బహూకరణ



టీవీ బహూకరణ కార్యక్రమంలో హెచ్ఎం, కంపెనీ ప్రతినిధులు

పెనుగంచిప్రోలు: స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌కు జేకే విత్తన కంపెనీ రూ.35 వేల విలువైన టీవీ బహూకరించింది. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విత్తన కంపెనీ ఆర్ఎం కే రమేష్ పాఠశాల హెచ్ఎం కె.జలజ చేతుల మీదుగా అందజేశారు. పాఠశాల పూర్వ విద్యార్థి, కాకాని వీరయ్య, రాజమ్మ ట్రస్ట్ వ్యవస్థాపకులు కాకాని సత్యనారాయణ రూ.16 వేల విలువైన క్రీడా పరికరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ బత్తుల వెంకటనర్సు, విత్తన కంపెనీ ఏరియా మేనేజర్ చంద్రమౌళి, రైతు కాకాని అశోక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.